క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



పిట్లం(జుక్కల్): మండలంలోని కంబాపూర్ గ్రామశివారులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శనివారం జీపీ కార్యదర్శి అంబయ్య పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేయించాలని, పనులు చేపడుతున్న స్థలంలో తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు.

చట్టాలపై అవగాహన



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి డివిజన్‌లోని పోలీసులకు పీపీ వీరయ్య శనివారం చట్టాలు, సెక్షన్లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిఫ్ కోర్టులో ఎల్లారెడ్డి డివిజన్‌కు చెందిన పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమాజంలో జరుగుతున్న సంఘటనల గురించి దానికి సంబంధించిన కేసులు నమోదైనప్పుడు పెట్టాల్సిన సెక్షన్లు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్, ఎస్సై, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

ఎల్లారెడ్డి అభివృద్ధికి నిధులు కేటాయించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డిలో వక్ఫ్ బోర్డు నిధులను అభివృద్ధి కోసం కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం ఎల్లారెడ్డికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆరిఫ్, షెకావత్ హైదరాబాద్‌లోని వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మత్ హుస్సేన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం




తాడ్వాయి(ఎల్లారెడ్డి) : క్రీడలు ఆడడం వల్ల మానసిక ఉల్లాసం కలుగడమే కాకుండా శరీరం దారుఢ్యంగా ఉంటారని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి వాలీబాల్ సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలు ఆడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవులు, సీనియర్ క్రీడాకారులు స్వామి, మాజీఎంసీ చైర్మన్ శ్యాంరావు, మాజీ ఎస్‌ఎంసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, క్రీడాకారులు సంతోష్, యోగేష్, సతీష్ రెడ్డి శ్యాంరావు,నిఖిల్,అరవిందుతదితరులున్నారు.

మహిళలకు ఆర్థిక చేయూతే లక్ష్యం



గాంధారి(ఎల్లారెడ్డి) : మహిళా సంఘాలకు ఆర్థికసాయం చేసి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించడమే తమ లక్ష్యమని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. శనివారం ఆయన మండలంలో జువ్వాడిలో గ్రామ మహిళా సంఘం భవనంలో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసే ఏకరూప దుస్తుల తయారీ బాధ్యతను మహిళా సంఘాలకే ఇస్తుందన్నారు.గ్రామ సంఘం మహిళలు,సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించవద్దు



గాంధారి(ఎల్లారెడ్డి) : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఏవో నరేష్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఎస్సై ఆంజనేయులుతో కలిసి రసాయన ఎరువు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు చేశారు. అందుబాటులో ఉన్న విత్తనాలు, కంపనీల వివరాలు, విక్రయించే ధరలను, రికార్డులను పరిశీలించారు. లూజు విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా హనుమాన్ జన్మోత్సవం

హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా శనివారం జిల్లావ్యాప్తంగా ఆయా హనుమాన్ ఆలయాల్లో సింధూర, గోపూజలు, దేవతా వృక్షాల పూజ, హనుమాన్ చాలీసా సామూహిక పారాయణాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఈ సందర్భంగా అన్నదానాలు నిర్వహించారు.



జిల్లా కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో భక్తుల పారాయణం



ఎల్లారెడ్డి రూరల్‌లోని మౌలానాశేఖ్‌లో..



పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయంలో..



దేవిపిహార్ వీరాంజనేయ స్వామి ఆలయంలో..



బ్రాహ్మణపల్లిలోని అంజనాద్రి వద్ద హనుమాన్ ఆలయంలో..

సైన్స్ టీచర్లతో గణితం బోధన సరికాదు



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కామారెడ్డి టౌన్ : విద్యాశాఖలో ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు సైన్స్ ఉపాధ్యాయులు గణిత బోధన చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు శనివారం డీఈవో రాజుకు వినతిపత్రం అందజేశారు. తక్షణమే ప్రభుత్వం ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్, సంతోష్, దేవిదాస్, చక్రపాణి, నాగవేందర్, సీతారం, మాణిక్‌రెడ్డి, పుట్ట పద్మ, గంగాధర్, సాయిలు తదితరులున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో బోరు తవ్వకం



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తీవ్రమైన నీటి సమస్య నేపథ్యంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి స్పందించారు. తన సొంత నిధులతో బోరు తవ్వకం చేయడానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు శనివారం ఆసుపత్రి ప్రధాన గేటు ముందు పనులు ప్రారంభించి తవ్వకం జరిపారు. దీంతో వైద్యాధికారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

'పాల ఉత్పత్తుల తయారీపై పరిశోధనలు చేయాలి'

కామారెడ్డి అర్బన్ : నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులకు విపరీతమైన గిరాకీ ఉందని ఇండియన్ డెయిరీ అసోసియేషన్(ఐడీఏ) తెలంగాణ చాప్టర్ ప్రధాన కార్యదర్శి జీఎం డాక్టర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా శనివారం కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డెయిరీ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ కేఎస్ ఉమాపతి, అకాడమిక్ ఇంచార్జి స్వర్ణలత, అధ్యాపకులు మాధవి, శరత్, శ్రీనివాస్, శైలజ, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సైబర్ నేరాలపై అవగాహన



నిజాంసాగర్(జుక్కల్) : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఏఎస్సై రాజేశ్వర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటీపీలు, ఆధార్, బ్యాంక్ అకౌంట్ నంబర్లు ఎవరికి చెప్పవద్దన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

బీబీపేట : ప్రమాదం జరుగుతుందని తెలిసినప్పటికీ విద్యుత్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న తీరు మండలంలో స్పష్టంగా కనిపిస్తుంది. మండల కేంద్రంలోని ఎస్ఎస్ 13, 14 గల స్తంబాల్లో ఇంటర్ స్తంబాలు కావాల్సి ఉన్నాయని ఆ ఏరియాకు చెందినటువంటి రైతులు చాలా సార్లు మండల విద్యుత్ అధికారికి విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా శనివారం సైతం ఒక వైరు విద్యుత్ స్తంభాల పైనుండి కింద పడిందని ఆ సమయంలో వైర్ల కింద ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని వారు వాపోయారు.



బీబీపేట శివారులో వేలాడుతున్న విద్యుత్ వైర్లు

డీబీఎఫ్ రాష్ట్ర సలహాదారులుగా ప్రభాకర్



బీబీపేట : దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర సలహాదారుడిగా మండలంలోని తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన తలారి ప్రభాకర్ ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన దళిత బహుజన ఫ్రంట్ నాల్గో మహాసభలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ అధ్యక్షుడు కుమార్ ప్రభాకర్‌ను నియమిస్తూ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా నుంచి లావణ్య, రాజలింగం, రవిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ప్రభాకర్ తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారి బ్రిడ్జి ముగింపు వద్ద నేలపైనే విద్యుత్ తీగలు ప్రమాదకరంగా పడి ఉన్నాయి. సరిచేయాల్సిన విద్యుత్ సిబ్బంది వాటిని అలాగే నేలపై పడేశారు. ఎవరైనా తీగలపై కాలుపెడితే ప్రాణాలు పోయే అవకాశం ఉండగా విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు పక్కన పడి ఉన్న విద్యుత్‌తీగలు

యోధుడు దొడ్డి కొమురయ్య

కామారెడ్డి రూరల్ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడువాలని కామారెడ్డి మండల వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్ అన్నారు. శనివారం కామారెడ్డి మండలం లింగాయిపల్లి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కురుమ కుల సంఘం సభ్యులు మదిరె శివయ్య, నంగి అయ్యేల్లం, దుమాల చిన్న మల్లయ్య, దుమాల రేఖయ్య, దుమాల నరేష్ తదితరులున్నారు.



క్యాండిల్ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): హైదరాబాద్‌లో గన్‌పార్క్ అమర వీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద అమరజ్యోతి వరకు నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.

సంక్షిప్తం

మృతదేహానికి అంత్యక్రియలు

భిక్కనూరు : మండల కేంద్రంలో ఒక నిరుపేద మృతి చెందడంతో కుర్మ సంఘం సభ్యులు ముందుకొచ్చి అంత్యక్రియలను నిర్వహించిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కుర్మ కులస్తుడైన మాసుల పెద్ద సాయిలు (67) సొంత ఇల్లు లేకపోవడంతో భిక్కనూరులో అద్దె ఇంట్లో తన కుమారుడు భార్యతో కలిసి ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి సాయిలు తీవ్ర అస్వస్థతకు గురికాగా, ఇంటి యజమాని సాయిలు కుటుంబాన్ని ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఒత్తిడి చేయగా సాయిలును కుటుంబసభ్యులు పశుసంవర్ధక శాఖ ఆస్పత్రి ఆవరణలో పడుకొబెట్టారు. శనివారం వేకువజామున సాయిలు మృతిచెందాడు. సాయిలు మృతికి ఇంటియజమానే కారణమని ఆయన అంత్యక్రియల ఖర్చు యజమానే భరించాలని పలువురు ఒత్తిడి తెచ్చారు. దీంతో సదరు యజమాని, కుర్మ సంఘం సభ్యులు సమావేశమై సంఘం తరఫున ఖర్చులు భరించి అంత్యక్రియలు పూర్తిచేశారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : పోస్టాఫీసు కార్యాలయంలో ప్రవేశపెట్టిన ప్రమాదబీమా, హెల్త్ ఇన్సూరెన్స్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టాఫీసు సిబ్బంది తెలిపారు. తాడ్వాయిలో శనివారం పోస్టాఫీసు ఆధ్వర్యంలో యాక్సిడెంట్, హెల్తు ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు. 18ఏళ్ల నుంచి నుంచి 65 ఏళ్లలోపు ఉన్నవారు మాత్రమే ఈబీమా చేసుకోవాలన్నారు. ఏడాది రూ.750 చెల్లించినట్లయితే రూ. 15 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. అలాగే ఏడాదికి రూ. 555 చెల్లించినట్లయితే రూ. 10 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్‌రావు, నర్సారెడ్డి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

'ఆ పాఠశాలకు అనుమతి లేదు'

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని కందర్‌పల్లి శివారులో కొత్తగా రిపుల్స్ లర్నింగ్ క్యాంపస్ స్కూల్ పేరుతో ప్రారంభమవుతోందని ఆ స్కూల్‌లో తల్లిదండ్రులు తమ పిల్లల కోసం అడ్మిషన్లు తీసుకోవద్దని ఎంఈవో రాములు తెలిపారు. రేకుల షెడ్డు వేసిన రిపుల్స్ స్కూల్‌కు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేదన్నారు. స్కూల్ ప్రారంభమవుతుందని యాజమాన్యం ప్రచారం చేసుకుంటుంది ప్రారంభిస్తే కేసునమోదు చేసి పాఠశాల సీజ్ చేస్తామని ఎంఈవో తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలో తల్లిదండ్రులు పిల్లలను చేర్పించవద్దని కోరారు.

కార్యాలయాలు ముస్తాబు

మద్నూర్(జుక్కల్) : ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానికంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ముస్తాబు చేశారు. ఉదయం 9గంటలకు ప్రభుత్వ కార్యాలయంలో జాతీయజెండాను ఎగురవేయనున్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : పశువుల పెంపకం దారులు పశువులకు గొంతువాపు నివారణ టీకాలు తప్పకుండా వేయించుకోవాలని పశువైద్య జేవీవో రవీందర్ తెలిపారు. శనివారం మండలంలోని కాటేపల్లి తండాలో పశువుల వైద్య సిబ్బంది పశువులకు గొంతువాపు నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. గోపాలమిత్ర రవీందర్ గంగారం పశువుల పెంపకం దారులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు కొనుగోలు చేయొద్దు



కల్యాణిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



మద్నూర్‌లోని విత్తనాల దుకాణంలో తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : రైతులు గ్రామాల్లో ఇంటి వద్దకు విత్తనాలను అమ్మడానికి వచ్చిన వారి వద్ద కొనుగోలు చేయవద్దని ఏఈవో రాజాగౌడ్ అన్నారు.శనివారం మండలంలోని కల్యాణి గ్రామంలో రైతులకు పంటల సాగు, విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు.రైతులు లైసెన్సు ఉన్న దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలను కొని దానికి సంబంధించిన రసీదును వెంట ఉంచాలని అన్నారు.

మద్నూర్(జుక్కల్) : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏఈ రాజు, ఎస్సై శ్రీకాంత్ సూచించారు. మండలంలోని పెద్ద ఎక్లార, మద్నూర్, మేనూర్‌లోని ఎరువులు, విత్తనాల దుకాణాలపై శనివారం పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు కలిసి దాడులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న ఆర్య క్షత్రియ సంఘం ప్రతినిధులు

కామారెడ్డి టౌన్ : ఆర్యక్షత్రీయ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఆర్య క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిట్టు వేణుగోపాలరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో చత్రపతి టీచర్ సొసైటీ, ఆర్యక్షత్రియ యువసేన ఆధ్వర్యంలో ఆర్య క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు, గురువుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. జిల్లా అధ్యక్షుడు నిట్టు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి వజీర్ శివాజీ రావు, సదాశివనగర్ మాజీ జెడ్పీటీసీ పడిగేల రాజేశ్వర్ రావ్, టీఎస్పీఎస్సీ మాజీ మెంబర్ సుమిత్ర ఆనంద్ ,రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మనోహర్రావు, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నిట్టురి ఆనంద్ రావు, గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత మారుతి రావు తదితరులున్నారు.

షబ్బీర్‌అలీ సహకారంతో అభివృద్ధి

భిక్కనూరు : కామారెడ్డి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సహకారంతో పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందడంతో పాటు రాష్ట్రంలోనే నియోజవకర్గం మొత్తం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తుందని కామారెడ్డి మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉరుదొండ వనిత రవి అన్నారు. శనివారం భిక్కనూరు మాజీ ఎంపీపీ బల్యాల రేఖ సుదర్శన్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నేతలు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వనితను సన్మానించారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ కామారెడ్డి మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ హయాంలో ఎన్నో అక్రమాలు జరిగాయని ఇప్పుడు అవినీతి అక్రమాలకు తావు ఉండకుండా ప్రజలకు పాలన అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, సీనియర్ కాంగ్రెస్ నేతలు కల్లురి సిద్దరాములు, సాయిక్రిష్ణ, నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ వనితను సన్మానిస్తున్న భిక్కనూరు మాజీ ఎంపీపీ

ఇసుక వాహనాలతో పరేషాన్

మద్నూర్(జుక్కల్) : వందల సంఖ్యలో వెళ్తున్న ఇసుక వాహనాలతో పరేషాన్ అవుతున్నామని మేనూర్ గ్రామస్తులు పోలీసులతో మొరపెట్టుకున్నారు. మండలంలోని మేనూర్‌లో ప్రతి శుక్రవారం వారం తపు సంత నిర్వహిస్తామని గ్రామస్తులు ఎస్సై శ్రీకాంత్‌కు తెలిపారు.బిచ్కుంద మండలంలోని ఖత్‌గావ్ ఇసుక క్వారీ నుంచి వందల సంఖ్యలో లారీలు మేనూర్ గుండా వెళ్తుండడంతో స్థానికంగా ఇబ్బందులు వస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 4 ఇసుక లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పూర్తి అనుమతితో ఇసుక లారీలు వెళ్తున్నాయని వారి వద్ద పత్రాలు ఉండడంతో లారీలను వదిలిపెడతామని ఎస్సై శ్రీకాంత్ చెప్పారు.



పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన ఇసుక వాహనాలు

ఆలయం వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శన



శెట్పల్లిసంగారెడ్డిలో ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహిస్తున్న గ్రామస్తులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామంలో శనివారం గ్రామ దేవతలకు ఎడ్లబండ్ల ప్రదర్శన గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు పలు ఎడ్లబండ్లను కొత్త బట్టలు, మామిడి తోరణాలు, రంగులతో అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అనంతరం గ్రామంలోని దుర్గమ్మ, పోచమ్మ ఆలయాల చుట్టూ ఐదుసార్లు ఎడ్లబండ్ల ప్రదర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రారంభమైన మాల పోచమ్మ ఆలయ ఉత్సవాలు

భిక్కనూరు : మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలోని మాల పోచమ్మ ఆలయం కల్యాణ మహోత్సవ ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 2వ తేదీ ఆదివారం బోనాలు, సోమవారం అమ్మవారికి కల్యాణం, ఓడి బి య్యం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మాల సంఘం కార్యనిర్వహణ వర్గం ప్రతినిధులు తెలిపారు.

